క్లుప్తంగా

ఏఐఎస్‌ఎఫ్ వార్షికోత్సవం


జెండా ఆవిష్కరణలో పాల్గొన్న విద్యార్థులు

రైల్వేకోడూరు అర్బన్ : ఏఐఎస్‌ఎఫ్ 88వ ఆవిర్భావ వార్షికోత్సవాన్ని విద్యార్థులు స్థానిక బీసీ హాస్టల్‌లో జెండా ఆవిష్కరించి శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఏఐఎస్‌ఎఫ్ నాయకుడు చైతన్య మాట్లాడుతూ విద్యార్థి లోకానికి స్ఫూర్తిని, చైతన్యాన్ని కలిగించి సంఘటిత శక్తిగా మార్చి ముందుకు నడిపించి ఏఐఎస్‌ఎఫ్ మాత్రమేనని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వేదాంత్, కృష్ణ, అబ్దుల్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

చిన్నమండెం : మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. శనివారం కావడంతో స్వామి వారి మూలవిరాట్‌మూర్తులను పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. పూజాది క్రతువులను స్వామి వారికి జరిపారు. స్వామి వారి దర్శనానికి భక్తులు పెద్దసంఖ్యలో వచ్చారు. అనంతరం తీర్థప్రసాదాలను అర్చకులు పంచిపెట్టారు.

ఏపీఎండీసీ ఎండీ కోలుకోవాలంటూ..


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఓబులవారిపల్లె : ఏపీఎండీసీ ఎండీ వీజీ వెంకట రెడ్డి త్వరగా కోలుకోవాలని శనివారం సీరుంపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో ఏపీ ఎండీసీ రిహాబిలిటేషన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గూనిపాటి వేణుగోపాల్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల గుండెకు సంబంధించి శస్త్రచికిత్స చేయించుకొన్న వీజీ వెంకట్ రెడ్డి త్వరగా కోలుకోవాలని ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ గల్లా నాగరాజు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆహార పొట్లాల పంపిణీ

రాయచోటి అర్బన్ : అన్నదానం మహాదానమని ఆంధ్రప్రదేశ్ కన్జూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం (సీఆర్‌పీఎఫ్) అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు జమాలుల్లా అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో ఆహార పొట్లాలను పంచారు. వినియోగదారులు ఎక్కడా మోసపోకుండా తమ హక్కులను కాపాడుకునేందుకు సీఆర్‌పీఎఫ్ పోరాడుతుందన్నారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం సంస్థ చేస్తున్న పోరాటాలకు ప్రతి ఒక్కరూ మద్దతునివ్వాలంటూ ఆయన కోరారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి హబీబుర్ రహిమాన్, అబూబకర్ సిద్దిఖ్, ముక్తియార్, అమానుల్లా, జాకీర్, న్యామత్, సాదిక్ తదితర కన్జూమర్స్ ఫోరం సభ్యులు పాల్గొన్నారు.


శనీశ్వరుడికి అభిషేకాలు

రాయచోటి టౌన్ : నక్కవాండ్లపల్లె సమీపంలోని (దిగువ అబ్బవరం పొలిమేర్లలో) శనీశ్వరాలయంలో శనీశ్వరుడికి విశేష పూజలు నిర్వహించారు. శనివారం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ప్రతి శనివారం తెల్లవారుజామున నుంచి స్వామి వారికి అభిషేకాలు, పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త లక్ష్మికర్ తెలిపారు.

పక్కా గృహాలను త్వరితగతిన నిర్మించుకోవాలి

సిద్దవటం : లబ్ధిదారులు పక్కా గృహాలను త్వరితగతిన నిర్మించుకోవాలని ఇన్‌చార్జి హౌసింగ్ ఏఈ చెన్నయ్య తెలిపారు. మండలంలోని పెద్దపల్లె, మాదవరం-1, ఉప్పరపల్లె గ్రామాలలో నిర్మిస్తున్న జగనన్న గృహాలను శనివారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పక్కా గృహానికి రూ. 1.80 లక్షలు మంజూరు చేసిందన్నారు. గృహాలను త్వరగా నిర్మించుకుంటే లబ్ధిదారుల ఖాతాలో డబ్బులు జమ అవుతాయన్నారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శి చేపూరి లక్ష్మీనరసయ్య ఉన్నారు.

నందలూరులో 3కే రన్


3కే రన్‌లో పాల్గొన్న క్రీడాకారులు తదితరులు

నందలూరు(రాజంపేట) : మండల కేంద్రమైన నందలూరులో సీపీడీవై - నందలూరు సబ్ సెంటర్ (క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్‌ఆర్ జిల్లా) 3కే రన్ సక్సెస్ ర్యాలీని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ ర్యాలీ నందలూరు సబ్ సెంటర్ నుంచి బస్టాండ్ హైవే జంక్షన్ వరకు సాగింది. ఏసీఏ - సెక్రెటరీ ఆదేశాల మేరకు ఏపీఎల్ (ఆంధ్రా ప్రీమియర్ లీగ్) 2వ సీజన్ ఈనెల 16వ తేదీ నుంచి ప్రారంభం కానున్న సందర్భంగా 3కే రన్ జరిపినట్టు తెలిపారు. ర్యాలీలో సీపీడీవై హెడ్ కోచ్ సయ్యద్ గయాజ్, అసిస్టెంటు కోచ్ ఫిరోజ్ ఖాన్ లోడి, ట్రైనర్ శివకోటి, క్యురేటర్ హరిక్రిష్ణ, అంపైర్స్ రాబిన్, ఈశ్వర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పేదవాడి మోములో చిరునవ్వు ఉండాలి

- సంక్షేమ పాలనపై అన్ని వర్గాల్లో సంతృప్తి
- గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు


పెనగలూరు: నా భూమి-నా దేశం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొరముట్ల


రైల్వేకోడూరు: కొరముట్లకు వినతిపత్రం అందిస్తున్న డ్వాక్రా సంఘాల మహిళలు

పెనగలూరు : ప్రతి పేదవాడి మోముపై చిరునవ్వు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. శనివారం సింగారెడ్డిపల్లి పంచాయతీలోని కొత్త సింగనమల, సింగారెడ్డిపల్లి గ్రామంలో గడప గడపకు కార్యక్రమాన్ని వైస్ ఎంపీపీ కొండూరు విజయ్‌రెడ్డితో కలిసి నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సున్నా వడ్డీ రావడం తమకెంతో సంతోషంగా ఉందని ఓ మహిళ తెలపడంతో జగన్ పాలనలో మహిళలకు ప్రతిరోజూ పండుగేనని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలలో మహిళలనే లబ్ధిదారులుగా చేసి వారికే సంక్షేమం అందిస్తూ కుటుంబాన్ని నిలబెట్టే బాధ్యతను అప్పగించామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా ఉన్నాయని వారు పేర్కొన్నారు. ప్రభుత్వ పాలనకు ఏ ఇంటికి వెళ్లినా ప్రజల మద్దతు సంపూర్ణంగా అందుతుందని వారు తెలిపారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారికి పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సచివాలయాలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు లక్షల ఉద్యోగాలు కల్పించిన ఘనత మన రాష్ట్ర ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. జగనన్న ప్రవేశపెట్టిన పథకాలు గురించి ప్రజలను అడుగుతుంటే జగనన్న పాలన భేషుగ్గా ఉందని ప్రజలు కితాబిస్తున్నట్టు కొరముట్ల చెప్పారు. గత ప్రభుత్వంలో పాలకులు ప్రతి ఇంటికి వెళ్లిన ప్రభుత్వం అందించిన పథకాలు గురించి వివరించి అర్హులు ఉంటే చెప్పాలని ఎవరైనా అడిగారా అని ఆయన ప్రజలను అడిగినప్పుడు జగనన్న ప్రభుత్వంలో పార్టీలు, కుల మతాలకతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని ప్రజలు తెలిపారు. కొత్త సింగనమలలో డ్రైనేజీ కావాలని కోరడంతో డ్రైనేజీని ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే హామీనిచ్చారు. ప్రజల నుంచి వస్తున్న వినతులను నోట్ చేసుకొని ప్రతి సమస్యను పరిష్కరించేలా అడుగులు వేస్తున్నామన్నారు. అనంతరం వైస్ ఎంపీపీ విజయ్‌రెడ్డి మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి ఇంటికి వెళ్లి వారికి వచ్చిన సంక్షేమ పథకాలు గురించి వివరిస్తుంటే పథకాలన్నీ తమకు అందాయని సంతోషంగా తెలుపుతున్నారన్నారు. ప్రజలు సంతోషంగా ఉండటమే పాలకుల లక్ష్యమన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షుడు పంజం సుకుమార్ రెడ్డి, సుధాకర్ రాజు, జెడ్పీటీసీ సుబ్బరాయుడు, మాజీ జెడ్పీటీసీ వై.నరసింహులు, సింగారెడ్డిపల్లె శివకుమార్, సిద్దవరం శ్రీనివాసులు రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేతా చక్రపాణి, సర్పంచ్ ఎల్లమ్మ, ఎద్దల శంకరయ్య, గుండ్లూరు మల్లి, హరినాయుడు, రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకం ఆవిష్కరణ

నా భూమి - నాదేశం కార్యక్రమంలో భాగంగా సింగారెడ్డిపల్లి పంచాయతీలో స్వాతంత్ర్య సమరయోధుల శిలాఫలకాన్ని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు కొండూరు విజయ్ రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వవిప్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం ఎంతో మంది ప్రాణాలకు తెగించి పోరాడారని ఆయన గుర్తు చేశారు. దేశం కోసం త్యాగాలు చేసిన వారిని గుర్తించుకోవడం మన బాధ్యత అని తెలిపారు.

పరామర్శ

ఓబులవారిపల్లె : మంగంపేట వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ రాజారత్నంను శనివారం రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రి నందు ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పరామర్శించారు. రైల్వేకోడూరు మండలం రెడ్డివారిపల్లికి చెందిన రాజారత్నం మంగంపేటలోని పల్వరైజింగ్ మిల్లులో పని చేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం భోజనం తీసుకొని ద్విచక్రవాహనంపై వెళ్తుండగా మంగంపేట పునరావాస కాలనీ వద్ద జాతీయ రహదారిపై ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. గాయాలైన రాజారత్నంను రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు రాజారత్నం ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకొని మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించాలని సూచించారు.

సమస్యలు పరిష్కరిస్తాం

రైల్వేకోడూరు : డ్వాక్రా సంఘాలకు చెందిన వీఓఏ, ఏపీఎంలు, సీసీలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించి వారికి న్యాయం చేస్తామని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఐదు మండలాలకు సంబంధించిన డ్వాక్రా సంఘాలకు చెందిన అందరూ కలిసి పలు సమస్యలపై ప్రభుత్వవిప్ కొరముట్లకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన మీ సమస్యలను వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడుతానన్నారు. అలాగే సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో కూడా చర్చించి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

పూజల్లో పాల్గొన్న భక్తులు

లక్కిరెడ్డిపల్లె : రాయచోటి - వేంపల్లి రహదారి మార్గంలోని మర్రిచెట్టు వద్ద వెలసిన లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో అర్చకుడు వెంకటనారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేక పూజలు నిర్వహించారు. రామాపురం మార్గంలోని గద్దగుండ్ల రాచపల్లె సమీపంలోని నామాలగుట్టపై వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంతోపాటు అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెడ్డివారిపల్లె రోడ్డు మార్గంలోని విశ్వభారతి హైస్కూల్ సమీపంలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు హరిస్వామి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

పకడ్బందీగా ఓటరు సర్వే


సర్వేలో పాల్గొన్న అధికారులు

చిట్వేలి : ఓటరు సర్వేను అవకతవకలు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భాస్కర్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం మండల పరిధిలోని దేవమాచిపల్లి పంచాయతీ రామాపురంలో ఓటరు సర్వే కార్యక్రమాన్ని అధికారులతో కలిసి నిర్వహించారు. ప్రతి ఇంటిలో సభ్యుల వివరాలను జాగ్రత్తగా పొందుపరచాలని అధికారులకు సూచించారు. ఆర్ఐ శేషంరాజు, వీఆర్‌ఓ భుజంగరావు, బీఎల్‌ఓ లక్ష్మిదేవి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

ఏపీఎండీసీ సీపీఓ సుదర్శన్ రెడ్డి


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సీపీఓ సుదర్శన్ రెడ్డి

ఓబులవారిపల్లె : మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ఏపీఎండీసీ సీపీఓ సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మంగంపేట ఏపీఎండీసీ ప్రాంగణంలోని క్రీడా మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా క్రీడా పోటీలను సీపీఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీఎండీసీలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు, పురుషులకు వేర్వేరు మైదానాలలో ఆటల పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీలలో గెలుపొందిన వారికి స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని బహుమతులు అందజేస్తామన్నారు. ఈ ఆటల పోటీల నిర్వహణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని, చైర్మన్‌గా గోపినాథ్, కమిటీ సభ్యులుగా చంద్రరాజేశ్వర్ రావు, నారాయణ రెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి తదితరులను నియమించినట్లు తెలిపారు. మూడురోజులపాటు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మైన్స్ మేనేజర్ శివబాబు, మెకానికల్ మేనేజర్ చలపతి రెడ్డి, మేనేజర్ గోపినాథ్, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

విద్యారంగ కాషాయీకరణను అడ్డుకుందాం



మాట్లాడుతున్న ప్రసన్నకుమార్

రాయచోటి అర్బన్ : విద్యారంగాన్ని కాషాయీకరణ చేసేందుకు కేంద్రంలోని బీజేపీ పాలకులు చేస్తున్న యత్నాలను కలసికట్టుగా అడ్డుకుందామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో శనివారం ఎస్ఎఫ్ఐ 2వ ప్లీనరీ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ దేశంలో విద్యారంగాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కాషాయ మూకలు నూతన విద్యావిధానాన్ని ముందుకు తీసుకుని వస్తున్నాయన్నారు. యూజీసీ, మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా లాంటి సంస్థలను నిర్వీర్యం చేస్తూ దుర్మార్గపూరితంగా విద్యార్థుల మెదళ్లలో హిజాబ్ లాంటి అంశాలను చొప్పించడం దారుణమన్నారు. సెక్యులర్ భావాలు కలిగిన దేశంలో విద్వేషాలు, మతోన్మాదంతో ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నారంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖాళీగా ఉన్న సాంఘిక సంక్షేమ వసతి గృహాల వార్డన్‌లు, జూనియర్ లెక్చరర్‌లతోపాటు ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలన్నింటిని వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కార్తీక్, నరసింహ, ఉపాధ్యక్షుడు రమణ, సహాయ కార్యదర్శి మనోజ్, నేతలు రమణ, రాజేస్, చందు, సునీల్‌నాయక్, సోను, ఉపేంద్ర, చిన్నరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీధులకు ఆదర్శమూర్తుల పేర్లు అభినందనీయం

నందలూరు(రాజంపేట) : నాగిరెడ్డిపల్లె అర్బన్ పరిధిలో విస్తరించబడిన వీధులకు దేశానికి సేవ చేసిన ఆదర్శమూర్తుల పేర్లు పెట్టడం అభినందనీయమని నాగిరెడ్డిపల్లె అర్బన్ సర్పంచ్ జె.సూర్యానారాయణ అన్నారు. శుక్రవారం రాత్రి మేజర్ పంచాయతీ కేంద్రమైన నాగిరెడ్డిపల్లె దళితవాడకు వెళ్లే రహదారికి మదర్ థెరిస్సా పేరుతో శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే నాగిరెడ్డిపల్లె అర్బన్‌లోని పలు వీధులకు జాతీయ నేతలు పేర్లు ఉన్నాయన్నారు. దీని వల్ల నిరంతరం వారిని స్మరించుకునే వీలుందన్నారు. జిల్లా వక్ఫ్‌బోర్డు జిల్లా సెక్రటరీ సయ్యద్ అమీర్ మాట్లాడుతూ నాగిరెడ్డిపల్లె పంచాయతీలో ఉన్న వీధులకు దేశం కోసం ప్రాణం త్యాగం చేసిన మహానీయులను పేర్లు పెట్టుకోవడం మంచిపరిణామమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్‌పీసీఎస్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు వేపగంట డేవిడ్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆకేపాటి రమేష్‌రెడ్డి, ఎముక దుర్గయ్య, దళిత నాయకులు తుమ్మది శివ, శివనరసింహులు, వేపగుంట మోషేతోపాటు పలువురు వార్డు మెంబర్లు, యువకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

మెస్ చార్జీలను వెంటనే పెంచాలి

రాయచోటి అర్బన్ : జగనన్న గోరుముద్ద మెస్ చార్జీలను వెంటనే పెంచకపోతే చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఏపీ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్‌బాబు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నాగసుబ్బారెడ్డిలు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని బాలికోన్నత పాఠశాల ఆవరణలో మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ సాధారణ సభ్యుల సమావేశంలో వారు మాట్లాడారు. మధ్యాహ్న భోజనం తయారీ కార్మికులకు ప్రభుత్వం గౌరవ వేతనం కింద రూ. 3వేలు చెల్లించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మెస్‌చార్జీలు పెంచకుండా గతంలో ఇస్తున్న రేట్లతో జగనన్న గోరుముద్ద నూతన మెనూను అమలు చేయాలంటూ ఒత్తిడి తేవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కార్మికుల వేతనాలతోపాటు మెస్‌చార్జీలను పెంచని పక్షంలో చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడతామంటూ వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సాంబశివ, యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాంద్‌బాషా, నాగరాణి, సలీంబాషా, వేణు గోపాల్‌రెడ్డి, నరసింహులు, ముజఫర్, క్రిష్ణవేణి, ఈశ్వరయ్య, అలివేలమ్మ, రామచంద్రతోపాటు కార్మికులు పాల్గొన్నారు.

జీఓ నం. 117తో పాఠశాల విద్య నిర్వీర్యం

రాయచోటి అర్బన్ : పాఠశాల విద్యను నిర్వీర్యం చేసే జీఓ నం. 117ను వెంటనే రద్దు చేయాలని ఫ్యాప్టో నేతలు ఆర్.రవిశంకర్, జగన్‌మోహన్‌రెడ్డి, హరిప్రసాద్‌లు డిమాండ్ చేశారు. ఫ్యాప్టో రాష్ట్రనేతల పిలుపు మేరకు శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు జిల్లా కలెక్టరేట్ ఎదుట 12గంటలపాటు సామూహిక నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. వారు మాట్లాడుతూ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ తన వైఖరిని మార్చుకోవాలన్నారు. జూన్ మాసంలో బదిలీలు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలని కోరారు. అశాస్త్రీయమైన ఉపాధ్యాయుల వర్క్‌లోడ్‌ను తగ్గించాలన్నారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నేతలు మహమ్మద్ ఇలియాస్, హరిబాబు, భాస్కర్ రెడ్డి, శివారెడ్డి, రవీంద్రారెడ్డి, వీరాంజనేయులు, ఆర్.వి.రమణ, రజాక్, సిబాతుర్ రహిమాన్, కిఫాయతుల్లా, చంగల్‌రాజు, చంద్రశేఖర్, నాగమునిరెడ్డితో పాటు పెద్దసంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సారా స్వాధీనం

పీలేరు రూరల్ : పదిలీటర్ల సారా స్వాధీనం చేసుకొని సారావిక్రేతను అరెస్ట్ చేసినట్లు సెబ్ ఎస్ఐ పి.లక్ష్మీనరసయ్య తెలిపారు. శనివారం తమ సిబ్బందికి అందిన సమాచారం మేరకు పట్టణంలోని యల్లమందక్రాస్ వద్ద దాడులు నిర్వహించగా యల్లమంద క్రాస్‌కు చెందిన మూడే సరోజమ్మ సారా కలిగిఉండడడంతో ఆమెను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. దాడుల్లో సిబ్బంది రాఘవయ్య, సుధాకర్,గంగామహేశ్వరీ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటండి


ఓబులవారిపల్లె: నా భూమి - నా దేశం కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, గ్రామస్తులు

ఓబులవారిపల్లె : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీడీఓ విజయారావు పేర్కొన్నారు. శనివారం చిన్నంపల్లి సచివాలయ పరిధిలో నాదేశం - నాభూమి శిలాఫలకాన్ని ఎంపీడీఓ విజయారావు, సర్పంచ్ నాగమ్మలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయ పరిధిలో పండుగ వాతావరణంలో కార్యక్రమాన్ని గ్రామస్తులు నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ మహనీయుల త్యాగాలఫలంతో మనకు స్వాతంత్ర్యం లభించిందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు కావడంతో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణకు ఉపాధి హామీ ఆధ్వర్యంలో గ్రామాలలో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తేజ, వలంటీర్ రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులకు వందనం

పుల్లంపేట : నా మట్టి - నా దేశం, నేలతల్లికి నమస్కారం కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని రంగంపల్లి పంచాయతీలో ఉపసర్పంచ్ బి.రెడ్డయ్య, ఎంపీడీఓ రఘురాంలు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవాలని, వారు చేసిన సేవలు గుర్తు చేసుకోవడంలో భాగంగా అమర వీరులకు వందనం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు యానాదయ్య, పంచాయతీ కార్యదర్శి వేమయ్య, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేకోడూరులో..

రైల్వేకోడూరు : నా భూమి – నా దేశం కార్యక్రమాలలో అందరూ భాగస్వాములు కావాలని మండల నీటి సంఘం అధ్యక్షుడు పంజం వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని అనంతరాజుపేట జెడ్పీ హైస్కూల్‌లో నా భూమి – నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా స్వాతంత్ర్య సమరయోధులు గుర్తుగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అమరవీరుల సంస్మరణార్థం మొక్కలు నాటారు. ప్రతి గ్రామంలో అమరవీరుల పేర్లు రాసిన శిలాఫలకాల ఆవిష్కరణ, వారికి గుర్తుగా మొక్కలు నాటడం, పంచ ప్రాణ ప్రతిజ్ఞలు చేయించడం వంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రత్నమ్మ, పంచాయతీ సెక్రటరీ శ్రీదేవి, స్కూల్ కమిటీ చైర్మన్ ఎల్లయ్య, శివయ్య, సచివాలయం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.


పుల్లంపేట : రంగంపల్లెలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న అధికారులు, నాయకులు


రైల్వేకోడూరు: మేరా మిట్టి - మేరా దేశ్ కార్యక్రమంలో పాల్గొన్న వేణుగోపాల్‌రెడ్డి తదితరులు

బ్రిడ్జి పనుల పరిశీలన

రైల్వేకోడూరు : మండల కేంద్రం నుంచి రెడ్డివారిపల్లె మార్గంలో నిర్మాణ దశలో ఉన్న బ్రిడ్జి పనులను శనివారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిడ్జి పనుల్లో నాణ్యత పాటిస్తూ త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్, అధికారులకు ఆదేశించారు. అలాగే పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, ఉపసర్పంచ్ శివసాయి, స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మికర్, రోడ్డు భవనాల శాఖ డీఈ జైప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

దోమల బెడదను తప్పించండి

పుల్లంపేట : మండల కేంద్రంతోపాటు చుట్టు పక్కల గ్రామాలలో గత కొంత కాలంగా దోమల బెడద అధికమైంది. గ్రామాలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు కష్టపడి పనిచేసుకొని రాత్రివేళలో పడుకుందామని అనుకుంటుంటే దోమలు ఇబ్బంది పెడుతున్నాయని ప్రజలు తెలిపారు. ఇంటిలో ఫ్యాన్ తిరుగుతున్నా చేతులు, కాళ్లు, ముఖంపై దోమలు దాడి చేస్తున్నాయని దీంతో ఒంటిపై దురదలు, చర్మంపై దద్దులు వస్తున్నాయని, నిద్రించే సమయంలో చెవులకు దగ్గరగా శబ్దం చేయడం వలన నిద్ర పట్టడం లేదని వృద్ధులు వాపోతున్నారు. కొంతమంది ఈ దోమకాటుకు గురై జ్వరంబారిన పడి ఆసుపత్రి పాలవుతున్నారు. అధికారులు స్పందించి తమను దోమల బెడద నుంచి కాపాడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రుషి కొండపై పవన్ రాజకీయం చేయడం తగదు

రామాపురం : రుషికొండపై పవన్ కల్యాణ్ రాజకీయం చేయడం తగదని అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి జాకీర్ హుస్సేన్ అన్నారు. మండల కేంద్రంలో విలేకర్ల ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పల్లకీని మోస్తున్న పవన్ కల్యాణ్‌కు రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు కనబడవని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీది అయితే, ప్రజలకు మంచి చేస్తున్న వలంటీర్లపై నోరు పారేసుకుని, టీడీపీ రాసిచ్చిన స్క్రిప్ట్ చదువుతూ ప్యాకేజీతో పబ్బం గడిపే వ్యక్తి పవన్‌కల్యాణ్ అని ఆరోపించారు. రుషి కొండ పక్కన ఉన్న కొండలపై నిర్మాణాలు పవన్ కల్యాణ్‌కు కనబడటం లేదా అంటూ ప్రశ్నించారు. ప్రజలకు ఏం చేస్తారో తెలియజేయకుండా వైఎస్సార్‌సీపీ పాలన బురదజల్లడమే పనిగా పవన్ తీరు ఉందన్నారు. పద్ధతి మారకుంటే ప్రజలే బుద్ధి చెబుతారనే విషయాన్ని ఇప్పటికైనా పవన్ గ్రహించాలని హితవు పలికారు.

వడ్డెర్లపై దాడి అమానుషం

రాయచోటి అర్బన్ : పెనుగొండ నియోజకవర్గం గోరంట్లలో వడ్డెర్లపై జరిగిన దాడి అమానుషమని బీసీ కులాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ జీవానందం, రజక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, శ్రీనివాసులు అన్నారు. గోరంట్లలో వడ్డెర్లపై జరిగిన దాడిని నిరసిస్తూ శనివారం వారు స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. వారు మాట్లాడుతూ గోరంట్లకు చెందిన వడ్డెర్లు పేడ దిబ్బలు వేసుకునే స్థలాన్ని కాజేసేందుకు అదే గ్రామానికి చెందిన చెవిరెడ్డి అనే నాయకుడు గుండాలతో కలసి బీరుబాటిళ్లు, ఇనుపరాడ్లతో దాడి చేయడం దారుణమన్నారు. వెంటనే దాడిచేసిన వారిపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలంటూ వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ నేతలు పల్లపు రవి, బాలక్రిష్ణ, శేఖర్, మైనార్టీ నాయకుడు జానీబాషా తదితరులు పాల్గొన్నారు.